# అతనో మందభాగ్యుడు

-డా॥ మంతెన సూర్యనారాయణరాజు

ఆరోజు శనివారం. సుబ్బారావుకి వారానికొక్కసారి ఉంటుంది ఆ క్లాసు. అదైనా గ్రామర్ పీరియడ్. తరగతి విద్యార్థుల విషయం చెప్పాల్సొస్తే వాళ్ళకి తోకలొక్కటే తక్కువని చెప్పాలి. ఆ సెక్షన్ పేరు చెబితే ఉపాధ్యాయు లందరికీ హడల్. సుబ్బారావు స్పెషాలిటీ ఏవిటి అంటూ తర్కించుకుంటే అంత ప్రముఖమైందేం కాదు. సుబ్రావ్‌లో కొన్ని దుర్బలమైన గుణాలు వుండటమేనని చెప్పుకోవచ్చు. ఆ అవగుణాల్ని దూరం చేసుకోవయ్యా మగడా అంటే సుబ్బారావు చస్తే వినడు. తాను పట్టిన కుందేలికి మూడేకాళ్ళంటూంటాడు. అందుకని ఉపాధ్యాయులే అతగాణ్ణి మూలశంకర్రావు అంటారు.

ఇంటర్వల్ పూర్తయింది. పీరియడ్ బిగినయింది. అందరు పిల్లలూ అందరు టీచర్లూ వర్కు వున్నంత మటుకు ఎవళ్ళ క్లాసులకు వాళ్ళు చక్కా వెళ్ళిపోయారు. కాని సుబ్బారావు మాత్రం టంచన్‌గా టైమ్‌కెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. పేంట్‌కేదో అంటుకున్నట్టు అనుమానం వచ్చి లేచి చూస్తే చూయింగ్ గమ్. లేచి కాలుగాలిన పిల్లిలా కూర్చోడానికి చోటులేక కలదిరిగాడు. అటెండెన్స్ వేశాడు. అసలు ఎవరైనా క్లాసులోకొస్తేగదా! ఏం చేస్తాడు. ప్రతీ పేజీ చివరా అలవాటు ప్రకారం సంతకాలు పెట్టాడు. ఇంతవరకూ ఒక్క విద్యార్థీ రాలేదేం చెప్మా అంటూ సందిగ్ధంలో పడ్డాడు.

తరగతి బైట విద్యార్థులున్నారు. ఇలా ఎంతకాలం గడపాలో అనుకుంటూ విద్యార్థుల వైపు సీరియస్ పోజు పెట్టి చూశాడు. ఆ క్లాసు హీరో ప్రక్కవాడికి కన్ను కొట్టాడు. ఈలోగా విద్యార్థినులు క్లాసులోకి వద్దామని ప్రయత్నిస్తూంటే నాయకుడు వెళ్ళొద్దని చెయ్యి చాపి ఆపుజేశాడు. అంతేకాదు గట్టిగా "బుల్ నెక్డ్ సుబ్బారావ్" అంటూ స్లోగన్ కొట్టాడు. "డౌన్! డౌన్" అంటూ విద్యార్థుల గొంతులు వంత పాడాయి.

"జిడ్డు సుబ్బారావు!"

"డౌన్! డౌన్!"

"ముడిగాళ్ళ ముదనష్టపు సుబ్బారావ్!"

"డౌన్! డౌన్!"

"పిల్లిలా రోజుకో యిల్లు మార్చే సుబ్బారావు"

"డౌన్! డౌన్!"

"ఆడపిల్లల వైపు పోజులు కొడుతూ పాఠం చెప్పే సుబ్బారావ్!"

"డౌన్! డౌన్!"

"అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు పట్టే సుబ్బారావ్"

"డౌన్! డౌన్!"

పచ్చి వెలక్కాయ గొంతుకడ్డం పడినట్లైంది సుబ్బారావుకి. తన పరువంతా తీస్తూ వాళ్ళు మోయవలసినంతా మోసేసారు. ఆ కేకలకు ప్రిన్సిపాల్ రామారావు గది బైటికొచ్చి అటెండర్‌ని పిలిచి విషయం ఏవిటో కనుక్కురమ్మని పంపాడు. అటెండర్ వీరాస్వామి విద్యార్థుల దగ్గరకొచ్చి అసలు క్లాసుకెళ్ళకుండా బోయ్‌కాట్ చేయడానికి కారణం ఏవిటని ఆరాతీశాడు. అంతా ముక్తకంఠంతో "ఆడపిల్లలవైపు చూసి పాఠం చెబుతున్నాడు. మాకు అతగాడి పాఠం వినిపించడంలేదు. ఛైర్మన్‌గారబ్బాయికి కాబోయే వైఫ్‌తో పరిచయం పెంచుకుంటున్నాడు. కుళ్ళు జోకులేస్తున్నాడు. అంచేత ఆయనగారు తన పద్ధతి మార్చుకునేదాకా క్లాసుకెళ్ళం" అంటూ మొండికేస్తున్నట్లుగా పలు అభియోగాలు సుబ్బారావు మీద నిర్భయంగా చేశారు.

విన్నదంతా తీసుకెళ్ళి పూసగుచ్చినట్లు దృష్టాంత, ఉత్ప్రేక్ష, నీచోపమాన మొదలైన అలంకారాలు జోడించి

## 'కాఫీ కొట్టు...'

ప్రేమ పంచదారతో
వలపుల పాలతో
నిగారింపు నీటితో
కైపెక్కు కాఫీపొడితో
సరాగాల సాసరలో
కలుపుగోలు కప్పుతో
కైపెక్కించే కలేజాతో
చిదిమిన చిద్విలాసంతో
నాకందించింది / 'కాఫీ' కొట్టు కిట్టమ్మ
డబ్బులడిగేసరికి / చక్కెర చుక్కలు కనిపించాయి

-శ్రీగోనె

మరీ చెప్పాడు అటెండర్ వీరాస్వామి. వట్టి సమయాల్లో అయితే అరివీర భయంకరుడులా పోజిచ్చే ప్రిన్సిపాల్ రామారావు ఇటువంటి చిన్న విషయాలకూ్కడా వీళ్ళు క్లాసుకు పోకుండా బాయ్‌కాట్ చేస్తున్నందుకు దిక్కు తోచక జుట్టు పీక్కున్నాడు. తన రూమ్‌లో వుండి వుంటే! కొద్దిగా చిర్రెక్కితే వీరాస్వామి జుట్టు పీకేవాడే! పాపం వీరాస్వామికి బట్టతలని గ్రహించి ఆ ప్రయత్నం విర మించుకున్నాడు. ధైర్యంగా వాళ్ల దగ్గరకెళ్లి రెండడుగులు ముందుకేసి "ఏయ్! ఏవిటా న్యూసెన్సు. క్లాస్‌కెళ్తే వెళ్ళండి. లేదా బైటికి పొండి" అంటూ ఊగిపోతూ గర్జించాడు.

గుంపులోంచి ఓ కొంటె కుర్రాడు "ఊగుతూ వాగే ప్రిన్సిపాల్" అంటూ చురక జారేసాడు. రామారావుకి ఆ మాట వినిపించింది. ముఖానికి పట్టిన చెమట కనబడకుండా తుడిచేసుకుంటూ "ఎవడ్రా! గాడిదా!" అంటూ వాళ్ళ మధ్యకు దూసుకుంటూ వెళ్లాడు. విద్యా ర్థులందరూ బైటికి వెళ్ళిపోయారు. లేకపోతే నంబర్లు కనుక్కుని ఫైన్‌లు వడ్డిస్తాడని తెలిసి ఉండటం చేత. సుబ్బారావు అటెండెన్స్‌లో ఆల్ ఆర్ ఆబ్‌సెంట్ అని వ్రాసి తీసుకెళ్ళి అటెండెన్సు రిజిష్టర్స్ తిప్పే ప్యూనుకిచ్చే సాడు. డిపార్ట్‌మెంటుకెళ్ళి కూర్చోవచ్చునని గదిలోకెళ్ళ బోతూండగా వీరాస్వామి వచ్చి "సార్! మిమ్మల్ని ప్రిన్సిపాల్‌గారు రమ్మంటున్నారు" అంటూ పిలిచాడు. ఏం కొంపమునిగిందోనని సుబ్బారావు ప్రిన్సిపాల్ గదిలోకెళ్ళాడు.

ప్రిన్సిపాల్ రామారావు టై సర్దుకుంటూ "చూడండి మేష్టారూ! మనం కొన్ని పద్ధతులు మనకోసం కాక పోయినా విద్యార్థుల కోసమైనా మార్చుకోవాలి సుమాండి. వాళ్ళు మన కళ్ళ ముందుండి అన్నీ గమ నిస్తూ వుంటారనే విషయం అసలు మర్చిపోకూడదు. ఒక్క ఆడవాళ్ళవైపే చూసి పాఠం చెప్పడం, అదీ వినిపించకుండా చెప్పడం వృత్తికి అన్యాయం చేసినట్లు అవుతుంది. పాపం! నిలబడే వున్నారే అలా కూర్చోండి. చూడండి. సారీ యిలా చెబుతున్నానని మరోలా అను కోకండి. ఎందుకంటే మీకన్నా పెద్ద ముండా వాడిని కాబట్టి..., అన్నట్టు అదివరకొకసారి మీరు పాఠం చెబుతూ మెళ్ళో గోల్డ్‌చైన్ సవరించుకుంటూ చెప్పడం, ఆడపిల్లల బెంచీల దగ్గరకెళ్ళి వాళ్ళ కాళ్ళు తొక్కుతున్నా రని ఆ మధ్య ఇద్దరాడపిల్లలు రిపోర్టు చేశారు. ఏదో సర్దిచెప్పి పంపేసా!"

"అంటే ఏవిటి మేష్టారూ మీ ఉద్దేశం? నేను అలా

## నే కవిత్వాన్నై పైకిలేస్తాను!

నేను సైతం!
విత్తులాగ స్వేచ్ఛగెదిగే/తత్వానికై నేనుద్యమిస్తాను!
నేను సైతం!
నా స్వేదాన్ని దోచుకోని
మనుషులుండే సమాజంకై
అశ్రువొక్కటి ధారవోస్తాను!
నేను సైతం!
కులం మతమని కుమ్ములాడీ
దురాచారాలతో సంఘాన్ని చీల్చి చెండాడే
మతోన్మాదుల తిక్క దిగేదాకా
సంఘ సంస్కర్తల చరితనొక్కమారు
నే పునరావృతం చేస్తాను!
నేను సైతం!
బానిసత్వాన్ని పారద్రోలి
బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే
దిశగా తెల్లరేకై నే పల్లవిస్తాను!
నేను సైతం!
బాధాసర్పదష్టుల మరెందరో భ్రష్టుల
ప్రగతికై నేనగ్నికీలనై ఉగ్రమిస్తాను!
నేను సైతం!
ప్రజల కోసం, సమత కోసం
మమత కోసం, సమసమాజం కోసం
సకల జనుల సుఖశాంతుల కోసం
"సర్వేజనా సుఖినోభవంతు" అన్న వాక్కు
సదా నిజం కావడం కోసం
నే నిరంతరం కవిత్వాన్నై పైకిలేస్తాను

## వేసవి!

గిరులు రగులుతున్నాయ్!
తరువులూ రగులుతున్నాయ్! /గ్రీష్ముడిక్కడ భీష్ముడై
తన ప్రతాపాన్ని చూపుతున్నాడు!
తపన హృదిలో మొదలైంది!
జీవితమంటే చిరాగ్గా ఉంది!
కోకిల వసంతానికి తృప్తినిచ్చినా!
మల్లెలు వెన్నెల్ని వెదజల్లినా!
స్వేదబిందువులు రాల్తూనే ఉన్నాయ్!
చెమట గాలులూ వీస్తూనే ఉన్నాయ్!
వేసవి వచ్చిందని!/వేడి (వేసవి) నిట్టూర్పులు తెచ్చిందని!

–దోసపాటి సత్యనారాయణమూర్తి

## ఆ ఉదయం కోసం

**ఒ**కరు పిలిస్తే ఉగాదిరాదు
ఎక్కడో గొంతెత్తితే కోయిల కూయదు
జీవితం పరుగు పందెమైనప్పుడు
పరుగే జీవితమైన మనిషి
పండుగల్ని ఎప్పుడో మరచిపోయాడు
మళ్లీ క్యాలండర్ చూస్తేనే పండుగ గుర్తొచ్చేది
కన్ను తెరచి మూసేవరకు
ప్రపంచమంత కంప్యూటర్ ముందు మోకరిల్లుతుంది
కంప్యూటర్ తెరకి అతుక్కున్న మనిషికి
ఉగాది పచ్చడి చేసే తీరికెక్కడుంది
సరుకులతో పాటు ఉగాది పచ్చడి కూడ
వెచ్చాలకొట్లో కొనుక్కోవలసిందే
వెబ్‌సైట్‌లో ఇరుకున్న మనిషికి
కోయిల పాటల్ని వినే తీరికెక్కడుంది
సీడీల్లో కోయిల గొంతుని అనుకరించి
జానపదాలు పబ్బుల్లో పాప్ సాంగ్స్‌గ మారుతున్నె
పాశ్చాత్య సంగీతపు హోరుకి
పట్టణాల నుండి కోయిల పల్లెలవైపు పరుగు తీస్తోంది
పండుగ రోజున ఇళ్లల్లో గడపాల్సిన జనం
డిస్కోథెక్కుల్లో డ్యాన్సులు చేస్తున్నారు
అమ్మ నాన్నలు మమ్మీ డాడీలైనప్పుడు
మాతృభాషా దినోత్సవాలు వారాంతపు సంతలుగ మారాలి
అక్కడ మళ్లీ మనం తెలుగు పాఠాలు మొదలెట్టాలి
మన సంస్కృతిని మనమే మరచిపోతున్నప్పుడు
రేపటి తరానికి సంస్కృతి బీజాల్ని మనమే నాటాలి
ఒకరు పిలిస్తే ఉగాది రాదు
ఎక్కడో గొంతెత్తితే కోయిల కూయదు
మన నరనరాల్లో సంస్కృతి ప్రవహించినప్పుడు
ఉగాది కొత్త వేకువై మనముందుంటుంది
వేల గొంతుల్ని ఒక్కటిగ కలిపి
కోయిల సంగీత ఝురుల్ని మనకోసం తెస్తుంది
ఆ కొత్త ఉదయం కోసం
ఆ కోయిల పాట కోసం
మనమంత కళ్లల్లో ఇళ్లు కట్టుకొని ఎదురు చూద్దాం

-చొక్కర తాతారావు

చేస్తున్నానని మీకెవరు చెబితే అది నమ్మడమేనా?" అంటూ టెంపర్‌మెంట్‌తో అడిగాడు. ఫీలయ్యాడు.

రామారావు సుబ్బారావుని వుండమని వాళ్ళిద్దరి పనీ చూసి పంపించేశాడు.

రామారావు సుబ్బారావుతో "మేష్టారూ! ముందు కాస్త మీరా దూకుడు తగ్గిస్తే నేను విషయం మామూలుగా చెబుతాను. మనం ఉపాధ్యాయులం. ఇది పవిత్రమైన వృత్తి. నలుగురికి చెప్పేవాళ్ళమే గాని నలుగురి చేత చెప్పించుకునే వాళ్ళం కాదు. క్లాసులోకి వచ్చిన పిల్లల్ని నయానో భయానో కూర్చోబెట్టి, ఏదో విధంగా వాళ్ళ దృష్టి మన మీద కేంద్రీకరించేలా చేసుకుని పాఠం చెప్పుకు పోవాలి. అంతేగాని పాత పంథాలోనే మీరు పోతాను అంటే నా డ్యూటీ నేను చేయాల్సి వస్తుంది" అంటూ ప్రక్కనున్న గ్లాసులో మంచినీళ్ళు రెండు గుక్కలు తాగాడు.

బుర్ర గోక్కున్నాడు అసహనంగా బుల్‌నెక్డ్ సుబ్బారావు. వీరాస్వామి "అయ్‌గోరూ! నన్నుండ మంటారా ఎల్లమంటారా" అంటూ రామారావుని అడిగాడు. సుబ్బారావు వైపు చూస్తూ "ఇంక నీ అవసరం ఉండదేమోలే!" అంటూ వెళ్ళిపొమ్మని ప్రిన్సిపాల్ వీరాస్వామికి సైగ చేశాడు. అతగాడు వెళ్ళిపోయాడు. వెళ్ళొస్తానని ప్రిన్సిపాల్‌తో చెప్పి సుబ్బారావు స్టాఫ్ రూమ్‌లోకి రాగానే ఎదురుగా కనిపిస్తున్న పటాన్ని చించి ముక్కలు చేసి డస్ట్‌బిన్‌లో పడేశాడు. అక్కడున్న కొలీగ్స్ ముండావాడికి ప్రిన్సిపాల్ బాగా బ్రెయిన్ వాష్ చేసి పంపివుంటాడని చంకలెగరేశారు.

❖ ❖ ❖

ఇంట్లో అడుగుపెట్టగానే సుబ్బారావుకి అతని భార్య మత్స్యకంటి ఎదురయ్యింది. ఆమె అసలు పేరు నీరజ. దిక్కుమాలిన కవిత్వం వ్రాయటం అలవాటు కావడంతో నీరజ కాపురానికి రాగానే అసలు పేరు పీకి ఈ మత్స్యకంటి అనే తోక తగిలించాడు. నీరజ ముఖంలో నవ్వు లేదు. ధుమ ధుమ లాడిపోతుంది. బహుశా యివ్వాళా కాకమీద వుండి వుంటుంది. చెప్పులు విప్ప గానే టెలిగ్రామ్ చేతికందిస్తూ ముఖం మాడ్చుకుంటూ "వైజాగట. ఎవతో విజ్జోగజ్జో సీరియస్ అట" అంటూ దీర్ఘం తీస్తూ చెప్పింది.

"ఓ ఐసీ! మా విజయరావుడా! అదేలే మా బుజ్జిగాడి తమ్ముడు విజ్జిగాడులే!" అంటూ సమర్థించుకుని చచ్చు నవ్వు ముఖమంతా పులుముకుంటూ చెప్పి ఊరుకున్నాడు. "మీ వెధవ నాటకాలు నమ్మడానికి

నేనేం మీలా బుర్రలేనిదాన్ననుకున్నారా! నాకు తెలుసున్నంత వరకూ మీకు పరిచయం వున్నవాళ్ళలో బుజ్జీలేదు విజ్జీలేదు. ఆ! అదే! విజయ. బరితెగించి బజార్లో తైతక్కలాడే సానిపాప లోగడ దానితో మీరో దిక్కుమాలిన నాటకమాడితే ప్రేక్షకులు చెప్పులు విసిరారు అదే కదూ!" అంది కోపంగా మచ్చుకంటి. సుబ్బారావు ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేకుండా పోయింది. నిజానికి అతని భార్య ఆడ సిఐడిగా పుట్టివుంటే గవర్నమెంటుకెంతో మేలుచేసి వుండేది. దురదృష్టం కొద్దీ తన కర్మకాలి మొండి శిఖండి ఇల్లాలుగా దాపురించింది అనుకుని సరిపెట్టు కున్నాడు. పుస్తకాలు రేక్‌లో పడేస్తూ ఆ రోజు వచ్చిన ఉత్తరాలు చూస్తూ కూర్చుంటే మత్స్యకంటి "ఇంద మీ కథ వాడికి నచ్చలేదట. వేరే ఏదైనా సెక్స్ పత్రికకు పంపి చూడమని సలహాయిస్తూ ఉత్తరం ఎటాచ్‌చేసి మరీ తిప్పి పంపాడు. పత్రిక పేరు అదేదే నోరుతిరిగి చావట్లేదు. ఆ! గుర్తుకొచ్చింది మడుగు" అని ఒక కవరు చేతికి అందించింది.

లాభంలేదు. తనిప్పుడేదో సీరియస్‌గా పనిచెయ్యక పోతే శ్రీమతి ఇంట్లో వున్నంతసేపూ వేపుకుతినేస్తుంది. మళ్ళీ ఎప్పటికి ప్రసన్నురాలౌతుందో చెప్పలేం అనుకుని పుస్తకం తీసాడు. ఈసారి మత్స్యకంటి అతనికి ఎదు రుగా కుర్చీలో కూర్చుని సుబ్బారావునే గుచ్చి గుచ్చి చూడసాగింది. సుబ్బారావ్ గుండె వేగంగా కొట్టుకో సాగింది. ఎటువంటి మాటల ఈటెలు తన శరీరంలో దిగబడతాయో అని భయపడసాగాడు. అనుకున్నట్టు గానే మత్స్యకంటి "అవును. మీ దగ్గర చదువుకునే పిల్లట. పేరు శుచిముఖి కాబోలు. తనని చైర్మన్ గారబ్బాయి ప్రేమిస్తున్నాడని, మీరు తనతో ఎక్కువగా చనువు తీసుకుమాట్లాడటంతో అతను తనను తిడు తున్నాడని చెప్పి వెళ్ళింది. మా యిద్దరి ప్రేమల మధ్య పానకంలో పుడకలా అడ్డు తగలొద్దని మాష్టారికి చెప్పండి అని కంటనీరు పెట్టుకుంటూ మరీ వెళ్ళింది" అంది.

ఎవరో సుబ్బారావుని గట్టిగా ఎడాపెడా లెంపలు వాయించేస్తున్నట్లుగా ఫీల్ అయిపోయాడు. మత్స్య కంటి భర్త తిరగటికొయ్యిలా కూర్చున్నందుకు మళ్ళీ కోపంతో "ఏవిటీ దేనికీ ఉలుకూ పలుకూ లేకుండా అలా కూర్చున్నారు. మౌనం అర్ధాంగీకారమా లేక మూర్ఖత్వమా?" అంటూ ఆగిపోయింది. సుబ్బారావు కిమ్మనలేదు. ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలింది.

# ఓ వసంతమా

కాలం రాలిపోయిన గతాన్ని మోసుకుపోతుంటే
రేపటి వసంతానికి చైతన్యం కావాలి
ఉగాదిని వెంటబెట్టుకు వచ్చావా
రాలిపోయిన ఆకులు చేదు అనుభవాలను మిగిల్చితే
కొత్త చిగుళ్ళతో మధుర స్మృతులుగా మిగలాలని
మోడుబారిన చెట్లన్నిటికీ చైతన్యం వస్తుందని
నీ కోసం ఎదురు చూస్తున్నాయి
గతాన్ని తలచుకొని ఎంతగా దుఃఖించినా
మరిచిపోక తప్పదంటావు!
కన్నీళ్ళకి చైతన్యం వచ్చి వసంతాలు కురిపిస్తావు!
నీ రాకతో చెట్లు చేమలన్నీ పచ్చగ కళకళలాడుతూ
చైతన్యంతో జీవం పోసుకొంటున్నాయి
నింగిలో మేఘాలకు చైతన్యం వస్తే
గ్రీష్మతాపాన్ని చల్లబరిచి నేలతల్లిని ఊరడిస్తుంది
చినుకు చినుకు జలపాతమై దాహం తీరుస్తుంది
చెట్లు చేమలకు, కొండ కోనలకు
నింగి, నేలకు, నది లోయలకు
అన్నిటికీ చైతన్యం వస్తుంది.
మనిషికి మాత్రం చైతన్యం రాలిపోతున్నది
మట్టిపొరలలో దాగి ఉన్న వేర్లలో
చీడపురుగులు పాకుతుంటే
ఆకుపచ్చని చిగుళ్ళన్నీ మాడిపోతున్నాయి
నరనరాల్లో పాకిన కామాగ్ని విషజ్వాలలకు
రేపటి మొగ్గలన్నీ రాలిపోతున్నాయి
పగ ప్రతీకార వాంఛలకు రంగు రంగుల పూలన్నీ
కామాంధులకు బలై-ముళ్ళపొదల్లో చిక్కుకొంటున్నాయి
పరిమళాల్ని కోల్పోయి రుధిరాన్ని వెదజల్లుతున్నాయి
కరువు కోసం నాటుకొన్న తరువులు
ఆకలి దప్పులు దీర్చి ప్రాణం పోస్తుంటే
నిలువెల్లా ఎండిపోయినా
చచ్చిన మనిషిని కట్టెగా కాల్చుతున్నాయి
మానవత్వానికెక్కడుంది ఆ త్యాగం
బాంబు దాడులకు చెల్లాచెదరైన కపోతాలన్నీ
శాంతి కోసం రెక్కలార్చుకొంటూ ఎక్కడికో వెళ్ళిపోయాయి
నిన్నటి శిశిరంలో రేపటి వసంతాలు జల్లి
మనసు పొరల్లో చైతన్యం రావాలని
గున్నమావి గుబురులో కోకిలమ్మ కొత్త సందేశమిస్తే
కవి కలం నుంచి కొత్త కావ్యం వ్రాయాలి
జన జీవన స్రవంతిలో చైతన్య గీతం పాడాలి
ఋతువులన్నీ ఏకమై వసంతానికి పట్టాభిషేకం చేయాలి!

**-తాటికోల పద్మావతి**

## లకుమ నానీలు

**త**న విమానమే-
పెద్దదంటాడు?
ఆకాశం వైపు చూపెట్టి-
మా చిన్నాడు!?

24 ఫ్రేమ్స్ / 24 క్యారెట్స్-
దేనికైనా ఓ లింకు
ఉండనే ఉంటుంది!?

నేడే చూడండి!
పెద్దలకు మాత్రమే?
హాలునిండా- / పిల్లలే!?

ఇట కన్నీటి సాగరంలో-
'కమలం'!
అట చితిపై
'మహాజన'ం!?

'గుప్పెడు గింజలు'
ఓ గొప్ప భరోసా!
ఇంక- / ప్రభుత్వాలతో పన్లేదు!?

'ఫిడేలు రాగాలు'
మూగవోయాయి!
కమాను- / ఆత్మహత్య చేసుకుంది!

అప్పటిదాకా- / వార్త మోసుకొస్తుంది!
ఆపైన- / మనం మోస్తాం!?

లంచం తీసుకుంటూ- / పట్టుబడ్డాం!
మొదట- / మన అంతరాత్మకే!?

మంచి అన్నది / మాదిగైతే-
మాదిగవుతాను,
'వర్గీకరణం' సాక్షిగా!?

'అయిదేళ్ళలో- / ప్రాజెక్టులు!'
కళా దర్శకులకు మాత్రమే-
సాధ్యమయ్యే పని!?

పచ్చదనాన్ని
ప్రేమిద్దాం!
ఒక తులసి దళంతో
దైవాన్నీ గెల్చుకుందా!?

ఆ జాకెట్టూ- / ఆ లంగానే!
వోణీ పొడవే
రెండింతలయ్యింది!?

-లకుమ

కొద్దిసేపు అలా కూర్చుని కూర్చుని ఇంక ఈ మొద్దావతారంతో అఘోరించే కన్నా హైదరాబాద్ టీవీ ప్రోగ్రాములు చూడటం మేలనుకుని లేచి వెళ్ళిపోతూ "భోజనం చేస్తానంటే టేబుల్ మీద అన్నీ వడ్డించి ప్రక్కింటికి టీవీ చూడ్డానికెళ్తున్నాను. లేకపోతే వచ్చాక వడ్డించమంటే వడ్డిస్తాను. మధ్యలో పిలిస్తే మీకు మర్యాద దక్కదు. ఆ..." అంది.

తలపైకెత్తి వైరాగ్యం పొందినవాడులా జీవంలేని నవ్వు నవ్వాడు సుబ్బారావు. ఈలోగా చైర్మన్‌గారబ్బాయి వచ్చాడని మిమ్మల్ని రమ్మంటున్నాడని కూతురు సరస పరిగెట్టుకుంటూ వచ్చి చెప్పింది. లేచి వాకిట్లోకి వెళ్ళాడు. "మిష్టర్ సుబ్రావ్! నేనెవరో తెలుసుకదా! మర్యాదగా నువ్వు ఎంతలో వుండాలో అంతలో వుండు. నాకు భార్య కాబోయే అమ్మాయితో ఇంకోసారి మాట్లాడినట్లు కనిపిస్తే చెప్పను, చేసి చూపుతాను. మైండిట్" అంటూ చూయింగ్ గమ్ నములుతూ హీరో హోండా మోటార్ సైకిల్‌ను వేగంగా నడుపుకుంటూ వెళ్ళిపోయాడు దినేష్. తిరిగొస్తున్న భర్తతో "అయ్యిందా సంబడం. ఆ అమ్మాయిని ప్రేమించినవాడులాగున్నాడు. దానివైపు కన్నెత్తి చూస్తే డొక్కచించుతాను. డోలుకడతాను, వాయిస్తాను అనుంటాడు. ఏం చేస్తాం! చేసుకున్న వాడికి చేసుకున్నంత. ఊ! నేను టీవీలో సినిమా చూసి మరీ వస్తాను. అన్నీ టేబుల్ మీదే పెట్టా! ముందు గుమ్మానికి అడ్డం తప్పుకుంటే వెళ్ళొస్తాను" అంది. అతడు తప్పుకోగానే ప్రక్కింటికి వెళ్ళిపోయింది మత్స్యకంటిగా మారిన నీరజ.

డామిట్! తనకు తన యింట్లో పనిమనిషికి ఇచ్చినంత విలువ ఇవ్వడంలేదు మత్స్యకంటి. తన బలహీనతలే కారణం. లేకపోతే అన్ని మాటలు అనగలిగేదా! ఛీ! ఇప్పుడా బాధలన్నీ మర్చిపోవాలి. దానికి ఒక్కటే మందు. పుస్తకాల బీరువాలో భార్యకు తెలియకుండా దాచిన సీసా తీసి విస్కీ గ్లాసులో నీళ్ళు పోసి కలుపుకుని తాగడం మొదలెట్టాడు. ఈసారి తన భార్య వచ్చి ఎన్ని తిట్లు తిట్టినా ఆ మైకంలో ఎన్నైనా భరించగలడు కాని, ఒక్కసారిగా తన అవలక్షణాలన్నీ కడిగేసుకోవాలనే సదుద్దేశం అతగాడికి మాత్రం కలుగ లేదు. ఎందుకంటే అతని బుద్ధి కుక్కతోక లాం టిది గనుక. ఎంత మనసు వద్దన్నా ఆడగాలి తగిల్తే సుబ్బా రావు పిల్లిమొగ్గలేస్తాడు గనుక. పెళ్ళం తిట్లు తినకపోతే నిద్రపట్టదు గనుక. పాపం! అతనో మందభాగ్యుడుగా చరిత్రకెక్కాడు. ■